క్లుప్తంగా

యూజీసీ నెట్‌కు అర్హత సాధించిన నవీన్



దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన నవీన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన (యూజీసీ నెట్) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజబులిటీ టెస్ట్‌లో ఉత్తీర్ణ సాధించాడు. గ్రామానికి చెందిన మంగలి బిచ్చప్ప, రుక్కమ్మ కుమారుడు నవీన్ పాలమూరు వర్సిటీలో ఎం.ఏ రాజనీతి శాస్త్రం అభ్యసించాడు. నవీన్ అర్హతపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఏఎమ్‌సీ డైరెక్టర్‌కు సన్మానం



ఆసిఫ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న మునీర్

కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఆసిఫ్‌ఖాన్‌ను మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ మునీర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా ఉన్న ఆసిఫ్‌ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తగిన గుర్తింపు నిచ్చారని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ముకీద్, కల్లు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత



పూర్వ విద్యార్థులు అందజేసిన వాటర్ బాటిల్స్‌తో విద్యార్థులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 1996–98 బ్యాచ్ పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేషనరీ అందజేశారు. హెచ్‌ఎం సాయిలయ్య ఆధ్వర్యంలో 48 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్స్, పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 28 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులంతా ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ అందజేయడం అభినందనీయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, క్లస్టర్ హెచ్‌ఎం రవీంద్రగౌడ్, పూర్వ విద్యార్థులు అంజిలయ్య, వెంకటేశ్‌గౌడ్, మొయిస్‌ఖాన్, కృష్ణ, సతీశ్ తదితరులున్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

పశువైద్యురాలు శ్వేత



ధారూరు: టీకా వేస్తున్న డాక్టర్ శ్వేత

ధారూరు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకా వేస్తున్నట్లు ధారూరు పశువైద్యశాల డాక్టర్ శ్వేత అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని మైలారం, దోర్నాల్, ధారూరు గ్రామాల్లో సిబ్బందితో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు గ్రామాల్లో 1,050 పశువులకు టీకా వేశామని చెప్పారు. నవంబర్ 14 వరకు టీకా పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఏ శ్యాంరావు, సిబ్బంది బాబురావు, యాదయ్య, భీమయ్య, రమేశ్, అమృతయ్య పాల్గొన్నారు.

పోచమ్మకుంట తండాలో పులి సంచారం?



తండావాసులు గుర్తించిన ఆనవాళ్లు

కొడంగల్: మండల పరిధిలోని పోచమ్మకుంట తండాలో పులి సంచరిస్తున్నట్లు తండావాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం తండా శివారులోని పొలాల్లో ఇందుకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి పాద ముద్రలు కనుగొన్నట్లు తెలిపారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రమాదకరంగా రోడ్లపై కల్లాలు

ఆందోళనలో వాహనదారులు



నాజుఖాన్‌పల్లి- చిలుముల మైల్వార్ మార్గంలో రోడ్డుపైనే పంట వ్యర్థాలు

దుద్యాల్: రోడ్లపై కల్లాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం బైక్‌లు, కార్లలో రాకపోకలు సాగించే వారు ఊహించని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించి, పంట దిగుబడులు, వ్యర్థాలను రహదారులపైకి తేకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉంది. మండలంలోని నాజుఖాన్‌పల్లి, చిలుముల్ మైల్వార్, సాగారం తండా, హంసంపల్లి, చెట్టుపల్లితండాలకు వెళ్లే రూట్లలో ఈ దృశ్యాలు అనేకం కనిపిస్తున్నాయి. రోడ్లపై పోసిన పంట ఉత్పత్తులు, వ్యర్థాలు రాత్రి వేళ సరిగ్గా కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో తమతమ వ్యవసాయ క్షేత్రాల వద్దే నూర్పిళ్లు చేసుకునే రైతులు వ్యర్థాలను పొలంలోనే పెట్టేవారు. ఆతర్వాత నీరు పెట్టడంతో కుళ్లి ఎరువుగా మారేవి. కానీ ప్రస్తుతం నూర్పిళ్ల విధానం పూర్తిగా మారిపోయింది.

అవగాహన కల్పించాలి



రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం, కల్లాలు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రహదారులపై వదిలేసిన వ్యర్థాలు వర్షానికి తడిసి వాహనాలు జారేందుకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా బైకులు జారి పడుతున్నాయి. ఉపాధి హామీ అధికారులు కల్లాల నిర్మాణంపై రైతులకు అవగాహన కల్పించాలి. రోడ్లు, పోలీసు అధికారులు చైతన్యం తేవాలి.

– మఠంల వెంకటయ్య, హస్నాబాద్

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

తహసీల్దార్ వెంకటేశ్



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

బషీరాబాద్: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని తహసీల్దార్ వెంకటేశ్ సూచించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన ఐకేపీ సర్వసభ్య సమావేశానికి తహసీల్దార్ హాజరై మాట్లాడారు. డబ్బులు పొదుపు చేయడం, పొదుపుగా వాడుకోవడం మహిళలకే ఎక్కువగా తెలుసన్నారు. అందుకే ప్రభుత్వాలు డ్వాక్రా పొదుపు సంఘాలను పెట్టి బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నాయని అన్నారు. శ్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలోనూ డ్వాక్రా మహిళలు కీలక భూమిక పోషించబోతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలలో ప్రతీ గ్రామం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించిందని చెప్పారు. ఈ సందర్భంగా ఏపీఎం పద్మారావు మండల సమాఖ్య 16వ వార్షిక బడ్జెట్ లెక్కలు వినిపించారు. ఈ ఏడాది డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల నుంచి రూ.34.48కోట్ల రుణాలు లక్ష్యం కాగా, ఇప్పటికే రూ.25 కోట్ల రుణాలు సంఘాలకు ఇప్పించామన్నారు. మహిళా శక్తి పథకంలో పెరటికోళ్ల పెంపకం, పశుపోషణ, చేపల పెంపకం వంటి వాటికి ఇచ్చే రుణాలను సంఘాలు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ విజయకుమారి, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మంగమ్మ, ఉపాధ్యక్షురాలు భానుప్రియ, కార్యదర్శి సావిత్రమ్మ, సహాయ కార్యదర్శి నాగమ్మ, కోశాధికారి రిహానబేగం, సీసీలు రాములు, భీమ్యానాయక్, హంపయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కంది పంటపై అవగాహన సదస్సు



డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాండూరు: కంది పంట పోషకాల నిర్వాహణలో జాగ్రత్తలు పాటించాలని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ సుధారాణి అన్నారు. శుక్రవారం తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కంది పంటపై రైతులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంది పంట పండించే విధానాన్ని శాస్త్రవేత్తలు రైతులకు అవగహన కల్పించారు. పంట సస్యరక్షణ చర్యలు, కీటకాల బారినుంచి పంటలను రక్షించే పద్ధతులు, ఎరువు, పురుగు మందుల వినియోగంపై రైతులకు వివరించారు. అనంతరం డ్రోన్‌తో పంటలకు మందుల పిచికారీ చేసే పద్ధతిని వీక్షించారు. శాస్త్రవేత్తలు పరిమళ, లక్ష్మణ్, యమున, శేఖర్, తాండూరు ఏడీఏ రుద్రమూర్తి, కోరమండల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఘన సన్మానం



ఎంఈఓ హరిలాల్‌ను సన్మానిస్తున్న సూర్యానాయక్

బొంరాస్‌పేట: మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన హరిలాల్‌ను లంబాడా హక్కులు పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం సూర్యానాయక్ మాట్లాడుతూ.. గిరిజన బిడ్డ హరిలాల్‌కు మండల విద్యాశాఖ బాధ్యతలు దక్కడం గర్వంగా ఉందన్నారు. గిరిజన పిల్లలకు విద్యఅందించి, తండాల్లో పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

‘ఫిజియోథెరపీ’ని వినియోగించుకోవాలి



విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయిస్తున్న మల్లేశ్

దుద్యాల్: అంగవైకల్యం ఉన్న విద్యార్థులు ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్టు మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దళితవాడ పాఠశాలలో విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం ఉన్న విద్యార్థుల కోసం ప్రతీ శుక్రవారం క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అంజిలయ్య, ఐఈఆర్‌పీ రాంశ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

పశువైద్యాధికారి దివ్యారెడ్డి



గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మొయినాబాద్ రూరల్: పశువుల పెంపకంలో రైతులు, పెంపకదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అమ్డాపూర్ పశువైద్యాధికారి దివ్యారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, అజీజ్‌నగర్ ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలన్నారు. పశువు కాపరులు, రైతులు అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. పశువులు అనారోగ్యాలకు గురైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పాడి పశువుల కాపరులు, నర్సింహ్మాచారి, కుమ్మరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికార్లు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మద్దూరు, మన్మయ్యతండా, షాబాద్, సర్దార్‌నగర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అక్రమార్కుల పేర్లను తొలగించండి

బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్



వినతి పత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్

షాబాద్: తాళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమార్కుల పేర్లు తొలగించి, అసలైన రైతులకు న్యాయం చేయాలని బీజేపీ షాబాద్ మండల అధ్యక్షుడు అంబడి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాళ్లపల్లి రెవెన్యూలో సర్వేనెంబర్ 483లో రికార్డు ప్రకారం ఉండవలసిన ప్రభుత్వ భూమి 153 ఎకరాల 4గుంటలకు గాను ప్రస్తుత రికార్డు ప్రకారం 233 ఎకరాల 29 గుంటలకు పెరిగిందన్నారు. ఈ సర్వేనెంబర్‌లో నిజమైన రైతులను గుర్తించి, అక్రమంగా రికార్డులో ఎక్కించుకున్న పేర్లను తొలగించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాజీవ్‌రెడ్డి, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించండి

ధారూరు: భారీ వర్షాల కారణంగా పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్ శుక్రవారం డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా కంది, పత్తి పంటలు పూర్తిగా పాడయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పాడైన పంటలకు సర్వే చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్ చొరవ తీసుకుని సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సమస్య పరిష్కరించాలని రైతుల డిమాండ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్ శివారులోని వ్యవసాయ బోరు మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాశీంపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. కాగా నిత్యం అంతరాయం కలుగుతోందని రైతులు అధికారులకు చెప్పినా పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గోనూర్ గ్రామానికి లక్ష్మీనారాయణపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు

డ్రోన్ సహకారంతో రసాయనాల పిచికారీ



రసాయనాలు పిచికారీ చేస్తున్న డ్రోన్

కొడంగల్: రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో సాగు చేపడుతున్నారు. శుక్రవారం పట్టణ శివారులోని పొలాల్లో డ్రోన్ సహకారంతో రసాయన మందులు పచికారీ చేశారు. రూ.600 చార్జీతో ఐదు నిమిషాల్లో ఎకరా పొలంలో రసాయనాలు పిచికారీ చేస్తామని డ్రోన్ ఆపరేటర్ వెల్లడించారు. డ్రోన్ ధర రూ.6 లక్షలు ఉంటుందని చెప్పారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

ఏబీవీపీ నాయకుడుల డిమాండ్



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్ నిధులు రూ.7,500 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు. సంవత్సరం గడిచినా ఈ ప్రభుత్వం కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఈ పెండింగ్ బకాయిలు శాపంగా మారిందన్నారు. డిగ్రీ, పీజీ పూర్తయినటువంటి విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు ఒత్తిడికి గురి చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఈ సమావేశంలో కిషోర్, విజయ్, ప్రశాంత్, శివకుమార్, అఖిల, ప్రవళిక సంధ్య పాల్గొన్నారు.

అర్థవంతమైన బోధన అవసరం

మండల విద్యాధికారి వెంకట్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: బోధనోపకరణాలు, టీఎల్‌ఎం, ఎఫ్‌ఎల్‌ఎన్‌లను వినియోగిస్తూ విద్యార్థులకు అర్థవంతమైన బోధన అందించాలని మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గొట్కుచెల్కతండా అనుబంధ గ్రామం మెట్టుగడ్డ తండా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం తరగతి గదుల్లో వేయించిన చిత్రాలను చూసి హెచ్‌ఎం సత్యనారాయణను అభినందించారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. మెనూ తప్పక పాటించాలని సూచించారు.

ఇందిరమ్మ కమిటీలో అసమ్మతి రాగం

పాత, కొత్త శ్రేణుల మధ్య ఆధిపత్య పోరు



తాండూరు రూరల్: అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి రాజుకుంటోంది. మండల పరిధిలోని పాత, కొత్త శ్రేణుల నడుమ ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఇందిరమ్మ కమిటీల నియామకాల్లో ఈ అసమ్మతి బహిర్గతమైంది. ఈ పంచాయితీ ఎమ్మెల్యే కుమారుడి వద్దకు చేరింది. వివరాలు ఇలా.. మండల పరిధిలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతీ పంచాయతీకి ఓ ఇందిరమ్మ కమిటీ నియమిస్తున్నారు. గ్రామ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శితో పాటు ఇద్దరు మహిళా సంఘం సభ్యులు, ముగ్గురు గ్రామస్తులుండాలి. ఈ ముగ్గురులో ఒకరు బీసీ, ఎస్సీ లేదా ఎస్టీ నుంచి ఒకరు, మరొకరు గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉండే వ్యక్తిని నియమించాలి. అల్లాపూర్, కోత్లాపూర్, మల్కాపూర్, కోటబాసుపల్లి, మిట్టబాసుపల్లితో పాటు పలు గ్రామాల్లో కమిటీల నియామకానికి ఏకగ్రీవం కాలేదు. ఈ గ్రామాల్లో రెండేసి జాబితాలు ఇచ్చారు. తమ వర్గం అంటే తమ వర్గం సభ్యుల పేర్లు పెట్టాలని నాయకులను కలుస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన వారిని కాదని ఎన్నికల ముందు వచ్చిన వారికి ప్రాధాన్యం ఎలా ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయి కమిటీల ఏర్పాటు వరకు ఏం జరుగుతుందో వేచి చూడాలి.

తనిఖీలు ‘పక్కదారి’



ధారూరులో సామాజిక తనిఖీ (ఫైల్)

ఇష్టారాజ్యంగా ఉపాధి హామీ సోషల్ ఆడిట్

- లెక్కలు, నిధుల దుర్వినియోగం, రికవరీపై సర్వత్రా విమర్శలు
- నామమాత్రంగా తంతు పూర్తిచేశారని అధికారులపై ఆరోపణ

ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీని లోపభూయిష్టంగా కొనసాగించిన అధికారులు మమ అనిపించారు. అర్ధరాత్రి వరకు తనిఖీలు చేస్తున్నట్లు చేసి, నామమాత్రంగా పూర్తి చేశారని పలు గ్రామాల యువజన సంఘాలు శుక్రవారం ఆరోపించాయి. మండలంలోని సగం గ్రామ పంచాయతీల్లో మస్టర్లు, ఎంబీలు లేకుండానే తనిఖీలు పూర్తిచేశారని, వివరాలు లేని తనిఖీలు ఎందుకని మండిపడుతున్నారు. పలు జీపీల్లో పనికి తగ్గ చెల్లింపులు లేవని, మరికొన్ని చోట్ల అదనంగా చెల్లించారని ఆరోపించారు. దుర్వినియోగమైన నిధుల రికవరీపైన సైతం స్పష్టత ఇవ్వలేని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 13 రోజుల తర్వాత గట్టెపల్లి, కేరెళ్లి, కుక్కింద, కుమ్మర్‌పల్లి, నాగారం, నాగ్‌సాన్‌పల్లి గ్రామ పంచాయతీల్లో అదనపు పేమెంట్లు జరగలేదని చూపడం, నాగసమందర్ జీపీలో రికవరీ డబ్బులున్నా జాబితాలో చేర్చి.. ఆతర్వాత కొట్టేశారన్నారు. మొత్తం 26 జీపీల్లో రూ.3.15 లక్షల రికవరీ చూపినా ఈ సొమ్ము కూలీల నుంచి రికవరీ చేయాలా..? ఫీల్డ్ అసిస్టెంట్లు చెల్లిస్తారా..? అనే వివరాలను వెల్లడించలేదన్నారు. ఇప్పటి వరకు జరిగిన 16 సామాజిక తనిఖీల్లో అదే రోజు పూర్తి వివరాలు వెల్లడించారని, ఈసారి మాత్రం ఎవరికీ చెప్పకుండా అధికారులు వెళ్లిపోయారని తెలిపారు. కేరెళ్లి, కుక్కింద జీపీల్లో పెనాల్టీ, రికవరీ ఉన్నా జాబితాలో చేర్చకపోవడం అనుమానాలకు దారితీసింది. నామమాత్రంగా రూ.1.25 లక్షలు చూపినా ఎవరినుంచి రాబట్టలనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇందులో ఓ అధికారికి పెద్దమొత్తంలో నగదు చేతికందడంతోనే సామాజిక తనిఖీ పక్కదారి పట్టిందని యువజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. సోషల్ ఆడిట్ రోజున వచ్చిన వారికి కనీసం భోజనాలు కూడా ఏర్పాటు చేయలేదని, గతంలో ఎన్నడూ ఇలాంటిది జరగలేదని తెలిపారు. గడువులోగా పనులు చేయించి, లక్ష్యాన్ని చేరుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతోనే.. పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఓ అధికారి చెప్పడం గమనార్హం. ఇందులో మండల అధికారుల పాత్ర అనుమానాస్పదంగా ఉందని, ఏపీఓ ప్రధమ సూత్రధారి అని వారు ఆరోపించారు. తనిఖీలో పూర్తి వివరాలు వెల్లడించాలని, అడ్డగోలు లెక్కలను అంగీకరించేది లేదని కొంతమంది అడ్డుకున్నా.. పోలీసులను పిలిపిస్తామని అధికారులు భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. అడ్డగోలుగా జరిగిన ఈ తనిఖీపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు యువకులు తెలిపారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

మాడ్గుల: పిడుగుపాటుకు 23 గొర్రెలు మృత్తి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి అంతంపేట గ్రామానికి చెందిన రైతు ముచ్చర్ల చిన్న బక్కయ్య తన గొర్లను రోజులాగే శుక్రవారం మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం వర్షం పడుతుండటంతో చెట్టుకింద వాటిని నిలువరించగా.. అదే ప్రాంతంలో పిడుగు పడి జీవాలు మృత్యువాత పడ్డాయని కాపరి తెలిపారు. జీవనాధారమైన గొర్లను కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.